సాక్షి
కుమురం భీం
సోమవారం । 6 । నవంబర్ । 2023



గుస్సాడీ షురూ..
దండారీ పండుగ సమీపిస్తుండగా గిరిజన గూడేలన్నీ శోభాయమానంగా తయారయ్యా యి. డప్పుచప్పుళ్లు, గిరిజనుల గుస్సాడీ నృత్యాలతో మార్మోగనున్నాయి. 10లో▸



నవశకానికి నాంది పలుకుతాం
అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లు మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు. ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడికే ఓటేస్తామని చెబుతున్నారు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /21.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి కాస్త తగ్గుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

‘ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తా’



మాట్లాడుతున్న గణేశ్ రాథోడ్

కెరమెరి: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ గెలుపుకోసం పని చేస్తానని టికెట్ ఆశించి భంగపడ్డ పార్టీ సీనియర్ నాయకుడు రాథోడ్ గణేశ్ స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. అధిష్టానం అన్ని విధాలుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అభ్యర్థికి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్, గిడ్డప్ప, చరణ్ తదితరులున్నారు.

‘ఎస్పీఎం కార్మికులకు తీరని అన్యాయం’
కాగజ్‌నగర్‌టౌన్: ఎస్పీఎం కార్మికులకు తీరని అన్యాయం చేసింది అధికార పార్టీ నాయకులేనని తెలంగాణ ఎస్పీఎం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు గోలెం వెంకటేశ్ ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మిల్లు పునఃప్రారంభమైనప్పటికీ కొన్నేళ్లుగా ఉద్యోగాలు చేసిన వారికి తిరిగి అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తంజేశారు. యాజమాన్యం స్థానికేతరులకే ఉద్యోగాలు కల్పిస్తోందని ఆరోపించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.35వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మరోసారి మోసం చేసి అతితక్కువ మొత్తం చెల్లించారని ఆరోపించారు.

పశువుల పోట్లాటలో బైక్‌లు ధ్వంసం
కాగజ్‌నగర్‌టౌన్: పశువుల పోట్లాటలో బైక్‌లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి రాజీవ్‌గాంధీ చౌరస్తాలో రెండు ఎద్దులు పోట్లాడుకున్నాయి. దీంతో ఐదు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. కాగా, పశువుల పోట్లాట తీరును చూసి అటుగా వెళ్లేవారు భయాందోళనకు గురై పరుగులు తీశారు. రోడ్లపై పశువులు సంచరించకుండా చూడాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, చౌరస్తాల్లో పశువులు తిరగకుండా చూడాలని కోరుతున్నారు.

‘ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్’



మాట్లాడుతున్న శ్యాంనాయక్

నార్నూర్: తెలంగాణ ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని రాజులగూడ ఫంక్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, కల్వకుంట్ల కుటుంబంలో మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేసి, గెలుపు కోసం పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లోఖండే దేవురావు, చౌహాన్ డిగంబర్, తిరుపతి, జాకీరుల్లాఖాన్, అడే వసంత్‌రావు, అడే డిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం’
నార్నూర్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం గాదిగూడ మండలంలోని బోడ్డిగూడ, గాదిగూడ గ్రామాల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ అడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేశ్, కార్యకర్తలున్నారు.

ప్రచారం.. ముమ్మరం



- గులాబీ పార్టీలోకి చేరికల వెల్లువ
- సామాజిక ఓటు బ్యాంక్‌పై నజర్
- బీజేపీ, కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు
- కొనసాగుతున్న బుజ్జగింపుల పర్వం
- ఇదీ.. ఆసిఫాబాద్ నియోజకవర్గ తీరు

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలన్నీ ప్రచారం ముమ్మరం చేశాయి. మూడు ప్రధాన పార్టీలకు అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారం జోరందుకుంది. అయితే బీఆర్‌ఎస్ నేతలు సమష్టిగా ముందుకు సాగుతుండగా.. కాంగ్రెస్, బీజేపీలో అసమ్మతి సెగలు చల్లారడంలేదు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని ముందుగా ప్రకటించడంతో ఆ పార్టీ ప్రచారంలో ముందుంది. కాగా, కాంగ్రెస్, బీజేపీలో అసమ్మతి కారణంగా బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన సందర్భంగా ప్రచార సరళిపై ప్రత్యేక కథనం.

సిట్టింగ్‌కు టికెట్ ఇవ్వకున్నా..
ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకి అధిష్టానం ఈసారి టికెట్ కేటాయించలేదు. దీంతో ఆయన పార్టీ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి సహకరిస్తారో.. లేదోనని మొదట్లో అంతా భావించారు. కానీ.. ఆయన అసమ్మతి రాగం ఎత్తుకోలేదు. అధిష్టానం ఆదేశాల మేరకు కోవ లక్ష్మి గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఆమె గెలుపు బాధ్యతను సీఎం కేసీఆర్ ఆత్రం సక్కుకి అప్పగిస్తూ.. ఆయన సమక్షంలోనే ‘బీ’ఫాం ఇచ్చారు. అంతేకాకుండా ఆత్రం సక్కుని ఆదిలాబాద్ ఎంపీని చేస్తానంటూ ప్రకటించారు. దీంతో కోవ లక్ష్మి గెలుపు బాధ్యతను ఆత్రం సక్కు తన భుజాలపై వేసుకున్నారు. ఇటీవల నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికల శంఖారావం పూరించారు.

అసంతృప్త నేతలకు బుజ్జగింపులు
బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి టికెట్ కేటాయించిన నుంచి ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆమె అసంతృప్త నేతల ఇళ్లకు వెళ్లి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ బుజ్జగిస్తున్నారు. అదే సమయంలో విపక్ష కాంగ్రెస్, బీజేపీ నేతలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ తన సోదరి మర్సుకోల సరస్వతిని తమ వైపు తిప్పుకోవడంలో రాజకీయ చతురత ప్రదర్శించారు. బీజేపీ వైపు మొగ్గు చూపిన సరస్వతి చివరి క్షణంలో మనస్సు మార్చుకునేలా కోవ లక్ష్మి చక్రం తిప్పి.. ఆదివాసీల ఓట్లు చీలకుండా తన గెలుపునకు మార్గం సుగమం చేసుకున్నారు. శనివారం సరస్వతితోపాటు తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకోవడంతో నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు, శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఇద్దరు ముఖ్యనేతలు బీఆర్‌ఎస్‌లోకి రావడం కోవ లక్ష్మికి కలిసొచ్చే అంశం. దీంతో సామాజిక ఓటు బ్యాంక్ కూడా చీలదన్న సంకేతం ప్రజల్లోకి వెళ్లింది. 2014 ఎన్నికల్లో గెలిచిన కోవ లక్ష్మి 2018 ఎన్నికల్లో 171 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన కోవ లక్ష్మి ఈసారి విజయానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

విపక్షాల్లో అనైక్యత కలిసొచ్చేనా?
కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థిత్వాలు ఖరారై ఆయా పార్టీలు ప్రచారం ప్రారంభించాయి. కానీ.. అసమ్మతి నేతల తీరుతో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. అసంతృప్త నాయకులను తమవైపు తిప్పుకోవడంలో వారు తలమునకలవుతున్నారు. బీజేపీ అభ్యర్థి గతంలోనూ పోటీలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ మొదటిసారి ఎన్నికల బరిలోకి దిగారు. కాగా, కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలంటూ ఆ పార్టీలోని కొందరు నేతలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. ముఖ్యంగా టీపీసీసీ సభ్యుడు డాక్టర్ గణేశ్‌రాథోడ్ రెబల్‌గా బరిలో ఉంటానని ప్రకటించారు. రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నా ఫలితం ఉండడం లేదు. అధిష్టానం జోక్యం చేసుకుంటే గాని రాజుకున్న అగ్గి చల్లారేలా కనిపించడం లేదు. పరిస్థితి సరిగా లేకున్నా కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని చాలా మండలాల్లో అసమ్మతి చల్లారడం లేదు. గణేశ్‌రాథోడ్ అనుచరవర్గం ప్రచారంలో పాల్గొనడం లేదు. ఇలా అసంతృప్తి సద్దుమణగపోవడం కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది.

అందని బెనిఫిట్స్

- 16 నెలలుగా నిరీక్షిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- త్వరగా చెల్లించాలని వేడుకోలు



సిర్పూర్(టి) ఎస్టీవో కార్యాలయం

సిర్పూర్(టి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించి రిటైర్డయిన ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. ప్రభుత్వం రిటైర్డ్‌మెంట్ తర్వాత అందించాల్సిన బెనిఫిట్స్, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేస్తోంది. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రిటైర్డ్ తర్వాత మూడు నెలల్లోపు గ్రాట్యుటీ, పెన్షన్ కమ్యుటేషన్, ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ అమౌంట్, పీఎఫ్ అమౌంట్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బెనిఫిట్స్ చెల్లించాల్సి ఉంది. రిటైర్డయి ఏడాదిన్నర దాటినా ఇప్పటిదాకా తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్స్ చెల్లించడంలేదు.

ఏడాదిన్నరైనా చెల్లింపుల్లేవ్..
ఉద్యోగ విరమణ తర్వాత మూడు నెలల్లోపు చెల్లించాల్సిన బెనిఫిట్స్ 12నుంచి 18 నెలలవుతున్నా చెల్లించకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంజేస్తున్నారు. బిల్లుల కోసం స్థానిక ఎస్టీవో, డీటీవో కార్యాలయాలతో పాటు పెన్షన్ కార్యాలయాల చుట్టూ ఏడాదికి పైగా తిరుగుతున్నా ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్ బిల్లులకు సంబంధించి ట్రెజరీ కార్యాలయాల్లో బిల్లులు సబ్‌మిషన్ చేసి టోకెన్ నంబర్లు కేటాయించామని, బిల్లుల నగదు వ్యక్తిగత ఖాతాల్లో ఎప్పుడు జమవుతాయో తమకు ఎలాంటి సమాచారం ఉండదని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు ఉద్యోగులు, పెన్షనర్లకు శాపంగా మారింది.

జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులు
జిల్లాలో సిర్పూర్(టి), కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి సబ్ ట్రెజరీ కార్యాలయాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో డీటీవో కార్యాలయం ఉంది. ఆయా ట్రెజరీ కార్యాలయాల పరిధిలో సుమారు 30మందికి పైగా ఉద్యోగులు రిటైర్డయి తమ బెనిఫిట్స్ కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లా మొత్తంగా 120నుంచి 150 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డయి ఏడాదికి పైగా బెనిఫిట్స్ కోసం వేచిచూస్తున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.20లక్షల నుంచి రూ.60 లక్షల వరకు రావాల్సి ఉందని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు.

నాలుగోతరగతి ఉద్యోగులే అధికం
జిల్లాలో ఏడాది కాలంగా రిటైర్డయినవారిలో అత్యధికంగా నాలుగోతరగతి ఉద్యోగులే ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. బెనిఫిట్స్ కోసం రిటైర్డ్ ఉద్యోగులు పైరవీకారులకు పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో పైరవీలు చేయలేని, పర్సంటేజీలు ఇవ్వలేని రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తంజేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు రావాల్సిన రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, బిల్లులు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఉద్యోగులు కోరుతున్నారు.

‘భీం ఆశయాలు నెరవేర్చుదాం’
కెరమెరి: మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో గల ఆదివాసీ భవన్‌లో ఆదివారం కుమురం భీం 83వ వర్ధంతిని ఆదివాసీలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీం చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సభ్యురాలు దుర్పతబాయి, సర్పంచులు న్యానేశ్వర్, నాయకులు కుసుంబ్‌రావు, జలపతిరావు, దండు, రఘునాథ్, బొజ్జిరావు, ప్రభాకర్, చందన్‌రావ్, శ్రీనివాస్, భీంరావు, రాము ఉన్నారు.



భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

- జిల్లా లీగల్ ఎయిడ్ సర్వీస్ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్
- ఆసిఫాబాద్ స్పెషల్‌సబ్ జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు

ఆసిఫాబాద్: రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డిస్ట్రిక్ట్ లీగల్‌సెల్ ఎయిడ్ సర్వీస్ చైర్మన్ ఎంవీ రమేశ్ సూచించారు. నేషనల్ లీగల్ ఎయిడ్ డేను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్ జైల్‌లో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదులను పెట్టుకోలేని ఖైదీలకు లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ కే యువరాజా మాట్లాడుతూ.. ఖైదీల హక్కులు, బాధ్యతలు వివరించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జే ప్రేమ్‌కుమార్, సిస్టర్ ఆరతి, న్యాయవాది రాజీవ్‌రెడ్డి, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.అంజనీదేవి, జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి’




విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రెబ్బెన: ఎస్సీ వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని ఈనెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మాదిగలు, ఉపకులాలు తలపెట్టిన విశ్వరూప మహాసభను జిల్లాలోని మాదిగలు, ఉప కులాలవారు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రభాకర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, ఉపకులాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలు, ఉపకులాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. నాయకులు కొండ్ర బ్రహ్మయ్య, పిట్టల సత్యనారాయణ, ఇగురపు సంజీవ్, అరికిల్ల స్వామి, గోగర్ల కళావతి, రమేశ్ తదితరులున్నారు.

సీపీఐ ఉనికి ప్రశ్నార్థకం..!




గుండా మల్లేశ్



కస్తాల రామకిష్టు



రంగనాథరావు



దాజీ శంకర్‌రావు



- ఉమ్మడి జిల్లాలో ప్రాభవం కోల్పోతున్న వైనం
- ఏడు సార్లు విజయబావుటా
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్, బెల్లంపల్లిలో ప్రాతినిధ్యం
- 2014 నుంచి మసకబారుతున్న పార్టీ

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. ప్రజా ఉద్యమాలే పరమావధిగా, సమసమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా నిర్మితమైన పార్టీ ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు గట్టి పట్టు సాధించింది. నిజాం నిరంకుశ, రాచరిక పాలన, రజాకార్లు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం చేసి పీడిత, తాడిత, అట్టడుగు వర్గాలకు చేరువైంది. అంతటి ఘనకీర్తిని సాధించిన సీపీఐని ఉమ్మడి జిల్లా ప్రజలు ఎంతగానో ఆదరించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల నుంచి 2009వరకు జరిగిన ఎన్నికల్లో ఏడు పర్యాయాలు పార్టీ విజయం సాధించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మూడేసి సార్లు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ఓసారి విజయ కేతనం ఎగురవేసింది. శాసనసభలో ప్రజల పక్షాన వాణి వినిపించి ఎర్రజెండా ఖ్యాతిని కమ్యూనిస్టులు ఎలుగెత్తి చాటారు. 2014 నుంచి సీపీఐ ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తుండగా.. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తుందా..? లేదా..? అనే అనుమానాలు ఆ పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతుండడం గమనార్హం.

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో..
తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం చేసిన కమ్యూనిస్టులను జిల్లా ప్రజలు అక్కున చేర్చుకున్నారు. సాయుధ పోరాట విరమణ అనంతరం 1952లో దేశవ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరిగాయి. తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండడంతో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు నేత దాజీ శంకర్‌రావు ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1957లో జరిగిన ఎన్నికల్లో మరో కమ్యూనిస్టు నాయకుడు డాక్టర్ రంగనాథరావు బోలన్‌వార్ కూడా పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1967లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన కస్తాల రామకిష్టు శాసనసభకు ఎన్నికయ్యారు.

ఆసిఫాబాద్‌లో ఎర్రజెండా రెపరెపలు
పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం సీపీఐకి బలమైన పట్టు కలిగిన స్థానంగా విరాజిల్లింది. 1983లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రథమంగా గుండా మల్లేశ్ సీపీఐ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలోనూ ఎమ్మెల్యేగా గెలిచి సత్తా చాటారు. 1985లో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లోనూ గుండా మల్లేశ్ సీపీఐ తరఫున పోటీలో నిలబడి విజయబావుటా ఎగురవేశారు. ఆ తర్వాత 1994లో జరిగిన ఎన్నికల్లోనూ మల్లేశ్ గెలిచారు. వరుసగా మూడు దఫాలు ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి మల్లేశ్ విజయం సాధించి తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. 2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగి పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నుంచి వేరుపడి బెల్లంపల్లి కొత్త నియోజకవర్గంగా ఏర్పడింది. బెల్లంపల్లికి 2009లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డుకెక్కారు. ఆ తీరుగా నాలుగు పర్యాయాలు గుండా మల్లేశ్ సీపీఐ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు.

గతమెంతో ఘనకీర్తి..
ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహించిన సీపీఐ క్రమక్రమంగా ఆధిపత్యాన్ని కోల్పోతూ వస్తోంది. ఎర్రజెండా మెరుపు కానరాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణం సన్నగిల్లడంతోపాటు ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఎన్నికల్లో తలపడే అర్థబలం, అంగబలం లేకుండా పోయి చతికిల పడినట్లుగా సీపీఐ నాయకులే అంగీకరిస్తున్నారు. ఒకానొక దశలో ఉమ్మడి జిల్లాలో ఎర్రజెండాను రెపరెపలాడించిన కమ్యూనిస్టులు ప్రస్తుత వర్తమాన కాల పరిస్థితులకు సరితూగలేక ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయలేక పొత్తులకు సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలో గతమెంతో ఘన కీర్తిగా చెప్పుకోవాల్సిన పరిస్థితులు కమ్యూనిస్టులకు ఏర్పడ్డాయి.

ఈసారి ఎన్నికల్లో..
ఉమ్మడి జిల్లాలో 2014 ఎన్నికల నుంచి సీపీఐకి ప్రాతినిధ్యం కరువైంది. 2018 ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా గుండా మల్లేశ్ పోటీ చేసి ఓటమి చవి చూశారు. ఈసారి ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దఫా కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నా పొత్తుల వ్యవహారం ఇంకా కొలిక్కి రానట్లుగా తెలుస్తోంది. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆరాటపడగా కాంగ్రెస్ చెన్నూర్ అసెంబ్లీ స్థానాన్ని కేటాయించడానికి సుముఖత వ్యక్తం చేసినట్లుగా ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఆ స్థానం నుంచి కూడా పోటీ చేసే అవకాశాలు లేనట్లుగా తెలుస్తుండగా కమ్యూనిస్టు శ్రేణుల్లో నిరాశ ఆవరించింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత
కాగజ్‌నగర్‌రూరల్: పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను ఆదివారం ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ బాధితులకు అప్పగించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పున్నం, ఎండీ సిరాజ్ సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పోయిన ఫోన్లను పోలీసులు గుర్తించారు. అనంతరం బాధితులకు అందజేశారు. మొబైల్స్ ట్రేసింగ్‌లో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను ఎస్సై అభినందించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


కామెర తిరుపతి (ఫైల్)

దహెగాం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గెర్రె గ్రామానికి చెందిన కామెర తిరుపతి (31), తన బంధువుల ఇళ్లలో కార్యక్రమం కోసం శనివారం బెజ్జూర్ మండలం కుకుడ గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఒడ్డుగూడ సమీపంలో రాత్రి అదుపుతప్పి కిందపడగా అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి మల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


స్వాధీనం చేసుకున్న గుడుంబాతో పోలీసులు

నెన్నెల: మండలంలోని గుడిపేట, శ్రావణ్‌పల్లి శివారులోని మామిడితోటల్లోని గుడుంబా స్థావరాలపై ఆదివారం చెన్నూర్ ఎక్సైజ్, నెన్నెల పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నాటుసారా తయారీ కోసం 21 కాటన్లలో నిల్వ చేసిన 420 కిలోల బెల్లం, 3 కిలోల పటికను స్వాధీనం చేసుకుని 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. వీటి విలువ మొత్తం రూ.1,68,240 ఉంటుందన్నారు. నాటుసారా తయారీదారుడు భుక్య రమేశ్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో చెన్నూర్ ఎక్సైజ్ సీఐ హరి, నెన్నెల పోలీసులు విజయ్, అనంతరావు, ప్రసాద్ ఉన్నారు.

శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మంచిర్యాలఅర్బన్: శబరిమల అయ్యప్ప దర్శనం కోసం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన ప్రత్యేక బస్సులు సమకూర్చనుందని డీఎం రవీంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామాన్లు సర్దేందుకు మరొకరికి బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశం ఉందని పేర్కొన్నారు. బస్సు బుక్‌చేసే వారికి ఉచిత ప్రయాణం ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేస్తే కమీషన్ ఇవ్వనున్నామని తెలిపారు. వివరాలకు 9959226004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

కుభీర్: మతిస్థిమితం లేని మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎండీ.షరీఫ్ కథనం ప్రకారం..మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన మంగేవార్ హీరవ్వ(40), సాయన్న భార్యభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త ఏడేళ్ల క్రితం, నాలుగేళ్ల క్రితం కుమారుడు, రెండేళ్ల క్రితం మరో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి హీరవ్వ మతిస్థిమితం కోల్పోయింది. ఆదివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆపస్మారక స్థితిలో ఉంది. చెల్లెలు గంగ చూసి కుటుంబికులకు చెప్పింది. వారు భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి మామ లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుస్సాడీ షురూ

పండుగ సమీపిస్తున్న వేళ గిరిజన గూడేలు ముస్తాబవుతున్నాయి. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా దండారీ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివాసీల ప్రత్యేక పండుగగా పిలిచే ఈ వేడుకలకు అంతా సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో వెయ్యి గూడేల్లో గ్రామాల పెద్దలు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు.

- దండారీలకు ముస్తాబైన 'గిరి'పల్లెలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామపెద్దలు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఆదివాసీల ప్రత్యేక పండుగగా గుర్తింపు
- దీపావళి వరకు కొనసాగింపు


నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

కెరమెరి: ఆదివాసీలకు పండుగ భావించే దండారీ ఉత్సవాలు రానే వచ్చాయి. నేటి నుంచి కొన్నిచోట్ల ప్రారంభం కాగా, రెండు రోజుల తర్వాత ప్రతీచోట జరగనున్నాయి. దండారీ సమూహాలుగా చేరి నృత్యాలు ప్రదర్శిస్తారు. నెమలిఈకలు పొదిగిన టోపీ, తలపాగా, కృత్రిమ మీసాలు, గడ్డాలు, జింకలేదా, మేక చర్మాన్ని ధరించి నృత్యాలు చేస్తారు. డప్పుల తోపాటు, పేప్రే, తుడుం, కాలికోమ్ తదితరాలను వాయిద్యాలుగా వాడుతారు. భోగి నుంచి ప్రారంభమై కోలబోడికి ఈ దండారీ ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు గుస్సాడీలకు కావల్సిన పరికరాల మరమ్మతుల్లో ఆదివాసీలు నిమగ్నమయ్యారు. ప్రేక్షకులు ఆదివాసీల మనసులను రంజింపజేసే డప్పుల తయారీతోపాటు గుస్సాడీలు తలపై ధరించే నెమలి పింఛాలు, కాళ్లకు కట్టే గజ్జెలకు మరమ్మతు చేస్తున్నారు.

భోగితో ప్రారంభమై..
కోలబోడితో ముగింపు

భోగి పండుగతో దండారీ ప్రారంభమవుతాయి. గుస్సాడీ, దండారీ ఏ గ్రామంలో ఉంటుందో అక్కడ వారు భోగి నిర్వహిస్తారు. అదేరోజు నుంచి గుస్సాడీ నృత్యాలు ప్రారంభమవుతాయి. దండారీల్లో అనేక రకాలున్నాయి. భేటికోలా, మానుకోల, సదర్‌కోలా, కోడల్‌కోలా, కలివల్‌కోలా తదితర రకాలు కోలలతో మహిళలు, పురుషులు దండారీ నృత్యాలు చేస్తారు. చివరిరోజు కోలబోడి చేస్తారు. ఆరోజు ఇంటిల్లిదిపాటు శుభ్రం చేసి గ్రామస్తులు, పెద్దలు గ్రామచివరిలో ఉన్న జమ్మిచెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడే ఆభరణాలు ఓ చెట్టుకు కట్టేస్తారు. హారతి నిర్వహిస్తారు.

నెమలిటోపీల తయారీకి ప్రసిద్ధి

నెమలి పింఛం టోపీల తయారీలో మండలంలోని పాటగూడ గ్రామం ప్రసిద్ధి. పాతికేళ్ల నుంచి గ్రామస్తులు వీటిని తయారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్(యూ), కెరమెరి, తిర్యాణి, వాంకిడి తదితర గ్రామాలకు చెందిన వారు ఇక్కడి నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. దీంతో ఆ గ్రామస్తులు పదిరోజుల క్రితం నుంచి ఈ పనులు ప్రారంభించారు. ఒక్కో నెమలి పింఛాల టోపీ ఖరీదు రూ.10 వేలు ఉంటుంది. తయారీకి కూలీ రూ.3 వేలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి దీపావళి వరకు..

దీపావళి పురస్కరించుకుని ప్రారంభమయ్యే గుస్సాడీ ఉత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆయా గ్రామాలు దండారీ ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి. ఏత్మాసార్ పేన్ దీక్షా స్వీకరించిన భక్తులు గుస్సాడీ తయారవుతారు. దీపావళికి వారం ముందుగానే ఉమ్మడి జిల్లాలోని అనేక ఆదివాసీ గూడెల్లో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రదర్శించే నాటికలు ఎంతో ఆదరణ పొందుతున్నాయి.


నెమలి పింఛం టోపీలు తయారు చేస్తున్న పాటగూడ వాసులు


సంప్రదాయ వాయిద్యాలు


దండారీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ప్రారంభమైన దండారీ ఉత్సవాలు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తేజాపూర్ పంచాయతీ పరిధి సాలేగూడలో భోగి పూజలతో ఈ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. గ్రామ పటేల్ మడావి కిషన్ ఇంటి ఎదుట యేత్మసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. దీపావళి తర్వాత కోలబోడి పూజలతో ఈ ఉత్సవాలను ముగిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. సర్పంచ్ మడావి కామేశ్వరి భీంరావ్, గ్రామపెద్దలు మడావి ధర్ము, కోవా కాశీరామ్, నైతం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నియమ నిష్టలతో..



దండారీ వేడుకలను ఎంతో నియమ నిష్టలతో జరుపుకుంటాం. భోగి నుంచి ప్రారంభమై ఈ ఉత్సవం కోలబోడి వరకు కొనసాగుతుంది. దండారీ రోజుల్లో ఆద్యంతం ఉత్సాహభరితంగా ఉంటుంది. ఉత్సవాలు జరిగే వరకు గ్రామంతా ఒకేచోట చేరి ఉల్లాసంగా గడుపుతాం. ఈ పండుగ మాలో ఐక్యతను చాటుకుంటుంది.

– దుందేరావు, చౌపన్‌గూడ

తరాలుగా ఆచారం



తరతరాలుగా వస్తున్న ఆచారం దండారీ ఉత్సవం. తాతముత్తాత నుంచి వస్తున్న ఆచారాన్ని నేటికి కాపాడుకుంటూ వస్తున్నాం. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గుస్సాడీ, ఉత్సవాలతో తెలుస్తాయి. ప్రతిఏటా నిర్వహించే వారే కాకుండా నూతనంగా కూడా దండారీలు నిర్వహిస్తుండడం..భక్త ప్రపత్తులను చాటి చెబుతుంది.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ, కెరమెరి

ప్రాణం తీసిన పబ్జీ గేమ్


వికాస్ మృతదేహం

ఇంద్రవెల్లి: పబ్జీ గేమ్‌కు బానిసై ఏడాది క్రితం మానసిక స్థితి కోల్పోయిన ఓ యువకుడు సెల్ టవర్ పైనుంచి పడి మృతిచెందాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై సునిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన దుర్వ జగదీశ్–మోహన్‌బాయి దంపతుల కుమారుడు వికాస్(19) ఇంటర్ మధ్యలోనే మానేశాడు. పబ్జీ గేమ్‌కు అలవాటు పడి ఇంట్లోనే ఉంటూ ఏడాది క్రితం మానసిక స్థితి కోల్పోయాడు. శనివారం రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. రాత్రి దేవాపూర్ నుంచి ముత్నూర్ గ్రామానికి చేరుకొని గ్రామ సమీపంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి పైనుంచి కింద పడి మృతిచెందాడు. గ్రామస్తులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మానసిక స్థితి సరిగా లేక సెల్‌టవర్ ఎక్కి పైనుంచి పడిపోవడంతోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి మోహన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విషాదం నింపిన వేడుకలు

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి, మరొకరికి గాయాలు
- నిర్మల్ జిల్లా చిన్నబెల్లాల్ గ్రామంలో ఘటన


పెంద్రం మోహన్(ఫైల్)


ఆత్రం భీంరావు(ఫైల్)

కడెం: గోండు వీరుడు కుమురంభీం వర్ధంతి కార్యక్రమం నిర్మల్ జిల్లాలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామపంచాయతీ పరిధిలోని గొండుగూడలో ఆదివారం భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జెండా గద్దె వద్ద భీం చిత్రపటాన్ని పెట్టి జెండా ఎగురవేసేందుకు ఇనుప పైపు అమరుస్తుండగా అది సమీపంలోని 11 కేవీ విద్యుత్ తీగకు తగిలింది. విద్యుత్ సరఫరా కావడంతో పైపును పట్టుకున్న మోహన్, భీంరావు, వెంకట్‌రావు షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన స్థానికులు బాధితులను విద్యుత్ సరఫరా నిలిపివేయించి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పెంద్రం మోహన్(25) మార్గమధ్యలో మరణించాడు. ఆత్రం భీంరావు(26) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరో బాధితుడు వెడ్మ వెంకట్‌రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆత్రం భీంరావుకు భార్య గంగామణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెంద్రం మోహన్ బీటెక్ పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఇద్దరు యువకుల మృతితో చిన్నబెల్లాల్ గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మళ్లీ బరిలో ఆ ముగ్గురే

- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు మారలే
- 2018లో ఒకసారి, 2023లో మరోసారి పోటీ
- 2014 నుంచి ఈ మూడు పార్టీల మధ్యే పోటీ


నడిపెల్లి దివాకర్‌రావు


ప్రేమ్‌సాగర్‌రావు


రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి 2018లో పోటీపడ్డ ఆ ముగ్గురు అభ్యర్థులే ఈసారి మరోసారి బరిలో ఉన్నారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి నడిపెల్లి దివాకర్‌రావు, కాంగ్రెస్ నుంచి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, బీజేపీ నుంచి రఘునాథ్ వెరబెల్లి బరిలో నిలవగా, బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023 ఎన్నికల్లో పార్టీలు గతంలో ఉన్నవారికే మరోసారి టికెట్లు కేటాయించింది. ఎన్నికల ప్రచారంలో ఆ ముగ్గురు ముందంజలో ఉండగా, అధికార పార్టీపై, ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్‌రావుపై కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు విమర్శలు చేస్తున్నారు. ఆయన్ను గెలిపిస్తే ప్రజలకు ఏం చేస్తారోననే దాని ప్రచార అస్త్రంగా మలుచుకుంటున్నారు. అధికార బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు మాత్రం వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే ఈ ముగ్గురు కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే కావడం విశేషం.

2014లో జరిగిన మంచిర్యాల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ ఉంది. దివాకర్‌రావు (బీఆర్ఎస్), గడ్డం అరవిందరెడ్డి(కాంగ్రెస్), ములుకాల మల్లారెడ్డి (బీజేపీ) నుంచి బరిలో నిలవగా దివాకర్‌రావు గెలుపొందారు.

7న బాక్సింగ్ పోటీలు

నస్పూర్: జిల్లా స్థాయి పురుషుల సీనియర్ ఎలైట్ బాక్సింగ్ పోటీలు పట్టణంలోని ఓల్డ్ బ్లూబర్డ్స్ స్కూల్‌లో ఈ నెల 7న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, మెడికల్ సర్టిఫికేట్, పాఠశాల, కళాశాల నుంచి పొందిన సర్టిఫికేట్ వెంట తీసుకు రావాలని తెలిపారు. విజేతలు ఈ నెల రెండో వారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎఫ్‌డీవో బర్నోబా


పులి సంచరించిన ప్రదేశాలను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో బర్నోబా

తాంసి: పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల శివారులో పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీవో బర్నోబా అన్నారు. తాంసి(కె) శివారులో పులి సంచరించిన ప్రదేశాన్ని అటవీశాఖ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి పరిశీలించారు. బేస్‌క్యాంపు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమీప గ్రామాల ప్రజలు అటవీశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. పంటచేలకు గుంపులుగా వెళ్లాలని సూచించారు. వారి వెంట అటవీసెక్షన్ అధికారి హైమద్, బీట్ అధికారి సాయికుమార్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు తదితరులున్నారు.

ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

- బంధువుల ఆందోళన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం నవజాత శిశువు మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటపల్లి మండలం దేవులవాడ గ్రామానికి చెందిన ఆసరెల్లి తిరుపతి భార్య తిరుపతమ్మ గత నెల 31న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆరోగ్య పరిస్థితి బాగా లేదని పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుడు పరీక్షించి చికిత్స అందించిన రెండ్రోజులకు డిశ్చార్జి చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత నీరసించి పోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స అందిస్తామని వైద్యుడు చెప్పినట్లు తెలిపారు. ఆదివారం శిశువు చనిపోవడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. సీఐ రాజు, ఎస్సైలు మహేందర్, రాజేందర్, జగదీశ్ ఆందోళన విరమింపజేశారు. కాగా, శిశువు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పానని, మెరుగైన వైద్యం అందించామని, తమ నిర్లక్ష్యం లేదని వైద్యుడు శ్రీశైలం తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన యువకుడు ఆకుల వంశీ(30) ఫిట్స్‌తో మృతిచెందాడు. ఈయన గత రెండేళ్లుగా మేడ్చల్ జిల్లా కొంపల్లిలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఫిట్స్ రావడంతో స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి తల్లితోపాటు అక్క ఉన్నారు.

బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థికి నగదు అందజేత


బాల్కసుమన్‌కి నగదు అందజేస్తున్న సర్పంచ్ రమేశ్

భీమారం: బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్‌కు ఎన్నికల ప్రచారం కోసం మండలంలోని పోలంపల్లి సర్పంచ్ దర్శనాల రమేశ్ రూ.51 వేల నగదు అందించారు. ఆదివారం చెన్నూర్‌లోని పార్టీ కార్యాలయంలో నగదు అందించినట్లు సర్పంచ్ తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచార వాహనానికి బ్రేక్


అధికారులు పట్టుకున్న వాహనం

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ అంబాసిడర్ కారుకు వినూత్నంగా రంగులు వేసి సిద్ధం చేసింది. అనుమతి లేకుండా వాహనం తిరుగుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమిషన్ 'సి విజిల్'కు ఫిర్యాదు చేసింది. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. మహారాష్ట్రకు చెందిన ఈ వాహనానికి అనుమతి కోసం బీఆర్ఎస్ నాయకులు రవాణాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న లొకేషన్ కాకుండా వేరే ప్రాంతంలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించినట్లు తెలిసింది.

ఓటరు మారారు.. మీరు కూడా మారండి..

- పట్టాలు ఇప్పించిన వారికే మా ఓటు



గోడపై అంటించిన వాల్ పోస్టర్లు

మందమర్రిరూరల్: 'మా ఇంట్లో ఆరు ఓట్లు కలవు. మాకు ఇళ్ల పట్టా లు లేవు. ఇప్పించిన వారికే మా ఓటు. నేను ఏ పార్టీకి పక్షపాతిని కాను. నాకు ఏ పార్టీ న్యాయం చేస్తే ఆ పార్టీకే మా ఓటు. ఓటరు మా రాడు.. మీరు కూడా మారండి..' అంటూ మందమర్రి మొదటి జోన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలో ఒక ఓటరు తన ఇంటి గోడకు పోస్టర్ అతికించాడు. గతంలో ఎన్నికల సమయంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ పట్టాలు ఇప్పించలేకపోయారని అందుకే పోస్టర్ వేసినట్లు ఇంటి యజమాని పేర్కొన్నాడు.

బెల్లంపల్లి యువ కవికి స్వర్ణకంకణం


వెంకటేశ్‌కు స్వర్ణకంకణం తొడుగుతున్న నిర్వాహకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన ఓ యువ కవికి అరుదైన సత్కారం జరిగింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో యువ కవి ముత్తే వెంకటేశ్ కవితాగానం వినిపించి అలరించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు స్వర్ణకంకణం తొడిగి, మెమోంటో అందజేసి శాలువ కప్పి సత్కరించారు. రాష్ట్ర జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు హరికృష్ణ, సుందర రామకృష్ణ, నరసింహారావు, రాధశ్రీ, మల్లారెడ్డి తదితరులు ఆయన్ను అభినందించారు.

దేశీదారు స్వాధీనం


దేశీదారుతో ఎక్సైజ్ పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: తనిఖీల్లో భాగంగా నిషేధిత దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. మహారాష్ట్రలోని బల్లార్ష నుంచి కాజీపేట వెళ్తున్న రామగిరి రైలులో ఆదివారం చేపట్టిన తనిఖీల్లో 220 దేశీదారు సీసాలు, 20 కిలోల అలం, వంద కేజీల బెల్లం పట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై రాజేందర్, సిబ్బంది ఉన్నారు.